సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 21 । జనవరి । 2023



రోడ్డు భద్రత నియమాలు పాటించండి

రోడ్డు భద్రత నియమాలు పాటించాలని జిల్లా రవాణాధికారి లీలాప్రసాద్ సూచించారు.

IIలో



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

సుజనకోటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది.

IIలో



స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

గిరిజన మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలని వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు కరుణశ్రీ కోరారు.

IIIలో

న్యూస్‌రీల్

కాఫీ రైతులకు ఆర్థిక చేయూత



కాఫీ గింజలను పరిశీలిస్తున్న శ్రీనాథరెడ్డి

చింతపల్లి: గిరిజన ప్రాంతాల్లో కాఫీ రైతులకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆప్కాబ్ ఎండీ శ్రీనాథరెడ్డి అన్నారు. డీసీసీబీ సీఈవో వర్మతో కలసి శుక్రవారం ఆయన చింతపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. మాతోట, మ్యాక్స్ రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా నడుస్తున్న కాఫీ పల్పింగ్ యూనిట్లను పరిశీలించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రోత్సాహంగా కొంతమేర నిధులను ఇస్తున్నామని ఆయన తెలిపారు. నేరుగా రైతుల ఖాతాల్లోనే తాము చెల్లించే ప్రోత్సాహాన్ని జమ చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. కాఫీ, రాజ్‌మా, మిరియాలు, పసుపు తదితర పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాబార్డు రిటైర్డ్ సీజీఎం సూరిబాబు, డీసీసీబీ డైరెక్టర్ సీతారామరాజు, గిరిజన వికాస్ సంస్థ సీఈవో సత్యనారాయణ, మాతోట సీఈవో చిన్నారావు, సిబ్బంది నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

శరీర సౌష్టవ పోటీల్లో చింతూరు విద్యార్థి ప్రతిభ



కాంస్య పతకం సాధించిన సూరిబాబు

చింతూరు: శరీర సౌష్టవ పోటీల్లో చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి పెనుబల్లి సూరిబాబు కాంస్య పతకం సాధించాడు. శుక్రవారం కాకినాడలో నన్నయ యూనివర్సిటీ శరీర సౌష్టవ ఛాంపియన్ షిప్ 60 కేజీల కేటగిరీలో ప్రతిభ కనబరిచాడు. అతనిని కోచ్ గోలి గంగాధర్, స్థానికులు అభినందించారు.

సారా పులుపు ధ్వంసం

డుంబ్రిగుడ: మండలంలోని కొర్ర పంచాయతీ శెట్టిబంద గ్రామంలో అక్రంగా సారా తయారు చేస్తున్నట్టు అందిన సమాచారం మేరకు శుక్రవారం దాడులు నిర్వహించినట్టు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ చెప్పారు. ఈ దాడుల్లో రెండు వేల లీటర్ల పులుపు ధ్వంసం చేశామన్నారు. గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



గాయపడిన వారికి చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

చింతూరు : మండలంలోని వాలమూరి గొంది వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. తూర్పు గోదావరి జిల్లా తోసిపూడికి చెందిన ఓ కుటుంబం కారులో భద్రాచలం రాముడి దర్శనానికి వెళుతున్నారు. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు వాలమూరిగొంది వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన వెంకటరమణ, సత్యవతి, అనిత, మణికుమార్‌తో పాటు ఏడాదిన్నర చిన్నారికి గాయాలయ్యాయి. వారికి స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం భద్రాచలం తరలించారు.

అనారోగ్యంతో శిశువు మృతి



శిశువు మృతదేహం

హుకుంపేట: శ్వాశ తీసుకోలేక ఐదురోజుల శిశువు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మండలంలోని తాడిపుట్టు పంచాయితీ గడుగుపల్లి గ్రామానికి చెందిన కె.ఝాన్సీ ఈ నెల 16వ తేదీన పురిటినొప్పుల రావడంతో కుటుంబ సభ్యులు పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ మగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే శిశువుకు శ్వాస సంబంధిత సమస్య ఉందని వైద్య సిబ్బంది తెలిపారు. దీంతో పాడేరు నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారని తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఇదే గ్రామంలో గత ఐదు నెలల క్రితం శ్వాస సంబంధిత సమస్యలతో ఇద్దరు పసిపిల్లలు మృతి చెందారు.

అమ్మకు అండగా..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వం అందుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తుండటంతో ఆస్పత్రుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. గర్భిణిగా గుర్తించిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకు వైద్యులు, సిబ్బంది చూపిస్తున్న చొరవ, స్త్రీల వైద్యనిపుణుల నియామకం కూడా ఇందుకు దోహదపడుతోంది.



ఫీడర్ అంబులెన్సులో తల్లీబిడ్డను ఇంటికి తరలిస్తున్న వైద్య సిబ్బంది



కొండ ప్రాంతం నుంచి గర్భిణిని పీహెచ్‌సీకి తీసుకువస్తున్న వైద్యసిబ్బంది

- ప్రసవానికి ముందు నుంచి వైద్య సిబ్బంది పర్యవేక్షణ
- ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు
- వారం రోజుల ముందుగానే బర్త్ వెయిటింగ్ రూమ్‌కు తరలింపు
- జననీ సురక్ష యోజనలో ప్రోత్సాహకం
- ప్రభుత్వాస్పత్రుల్లో పెరుగుతున్న ప్రసవాల సంఖ్య

చింతూరు: డివిజన్ పరిధిలో చింతూరు ఏరియా ఆస్పత్రి, కూనవరం సీహెచ్‌సీ, మోతుగూడెం, తులసిపాక, ఏడుగురాళ్లపల్లి, లక్ష్మీపురం, నెల్లిపాక, గౌరిదేవిపేట, కూటూరు, రేఖపల్లి, జీడిగుప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల సంఖ్య పెరుగుతోంది.

కొండలపై గర్భిణులపట్ల ప్రత్యేక శ్రద్ధ

చింతూరు, కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో ఎత్తయిన కొండలపై కొండరెడ్ల గ్రామాలున్నాయి. వీటిలోని గర్భిణుల పట్ల వైద్యసిబ్బంది ప్రత్యేకశ్రద్ధ కనబరుస్తున్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని వైద్యసిబ్బంది ఎంతో కష్టంతో ఎత్తయిన కొండలను ఎక్కి ఎప్పటికప్పుడు గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. ఆయా గ్రామాల్లో పర్యటించి గర్భిణులు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిస్తున్నారు. సమీప పీహెచ్‌సీలకు తరలించి వైద్యాధికారి ద్వారా పరీక్షలు చేయిస్తున్నారు. ప్రసవతేదీకి వారం రోజుల ముందుగానే వారిని కొండలపై నుంచి కిందకు దింపి సమీపంలోని పీహెచ్‌సీలకు తరలిస్తున్నారు.

వైద్య సిబ్బంది పర్యవేక్షణలో..

- గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది 12 వారాలలోపు గర్భిణులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేస్తారు. ఆమె కాన్పుల వివరాలు, ఆరోగ్యపరమైన అంశాలను నమోదు చేస్తారు. 12 వారాల అనంతరం ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను మూడు విడతలుగా అందిస్తారు.
- 13 నుంచి 27 వారాల లోపు సమీపంలోని పీహెచ్‌సీలో వైద్యాధికారి ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు సంబంధిత ఏఎన్‌ఎం గర్భిణి ఆరోగ్య పరిస్థితిపై పర్యవేక్షణ ఉంటుంది.
- బీపీ, షుగర్ వంటి అనారోగ్య సమస్యలతో పాటు గత కాన్పులో సిజేరియన్ ఏమైనా జరిగి ఉంటే హైరిస్క్ కేసుగా నమోదు చేస్తారు.
- 28 నుంచి 34 వారాల నడుమ మూడో విడత పరీక్షలతో పాటు స్కానింగ్ నిర్వహించి బిడ్డ పరిస్థితి ఎలాగుందో గమనిస్తారు.
- 35వ వారం నుంచి కాన్పు నడుమ నాలుగో విడత పరీక్షలతో పాటు సాధారణ కాన్పు జరుగుతుందా లేదా సిజేరియన్ చేయాల్సి ఉంటుందా అనే విషయాన్ని గుర్తిస్తారు. కాన్పుకు వారం ముందుగానే గర్భిణులను ఏఎన్‌ఎం, ఆశా వర్కర్ పర్యవేక్షణలో సమీపంలోని పీహెచ్‌సీకి తరలించి బర్త్ వెయిటింగ్ గదిలో ఉంచుతారు.

సౌకర్యాలిలా..

బర్త్ వెయిటింగ్ రూమ్‌లో ఉన్న గర్భిణితో పాటు ఆమె సహాయకులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఉచితంగా అందిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు జరిగిన తరువాత వారికి జననీ సురక్ష యోజనలో రూ.వెయ్యిని వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారు.తల్లీ, బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం ద్వారా బాలింత, బిడ్డను స్వగ్రామానికి తరలిస్తారు.

మూడేళ్లలో 4,024 ప్రసవాలు..

చింతూరు డివిజన్ పరిధిలోని చింతూరు ఏరియా ఆస్పత్రి, కూనవరం సీహెచ్‌సీ, తులసిపాక, ఏడుగురాళ్లపల్లి, లక్ష్మీపురం, నెల్లిపాక, గౌరిదేవిపేట, కూటూరు, రేఖపల్లి, జీడిగుప్ప పీహెచ్‌సీల్లో 2020లో1,415, 2021లో 1,385, 2022లో 1,224 ప్రసవాలు జరిగాయి.

ఫీడర్ అంబులెన్సుల్లో..

కొండలపై నివసిస్తున్న కొండరెడ్ల తెగకు చెందిన గర్భిణులతోపాటు అంబులెన్సు సర్వీసుల వెళ్లలేని పాంతాలకు చెందిన గర్భిణులను ఆస్పత్రికి తరలించేందుకు ఫీడర్ అంబులెన్సులను వినియోగిస్తున్నారు. చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్ పురం మండలాల్లో ఆరు ఫీడర్ అంబులెన్సులు సేవలు అందిస్తున్నాయి

చాలా బాగా చూస్తున్నారు



కాన్పు నిమిత్తం చింతూరు ఏరియా ఆస్పత్రికి వచ్చా. ఇక్కడి వైద్యసిబ్బంది ఎంతో బాగా చూసుకున్నారు. ఈనెల 14న సాధారణ కాన్పు జరిగింది. బిడ్డ కూడా ఎంతో ఆరోగ్యవంతంగా ఉంది.

– దురవా రాములమ్మ, దేవరపల్లి, చింతూరు మండలం

సౌకర్యాలు మెరుగు



గతంలో కంటే ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు చాలా మెరుగుపడ్డాయి. కాన్పు నిమిత్తం వస్తున్న గర్భిణులకు భరోసా కల్పించి సుఖప్రసవం అయ్యేలా చర్యలు చేపడుతున్నాం. ప్రైవేటు ఆస్పత్రుల్లో తిరస్కరించిన కేసులు కూడా వస్తున్నాయి. ఏజన్సీ ప్రాంతంలో రక్తహీనత లోపంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

– శశికళాదేవి, గైనకాలజిస్ట్, ఏరియా ఆస్పత్రి, చింతూరు

నిరంతర పర్యవేక్షణ



గర్భిణుల ఆరోగ్య పరిస్థితిపై క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నాం. ప్రతినెలా తొమ్మిదో తేదీన వైద్యాధికారుల ద్వారా ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రత్యేక క్యాలెండర్ రూపొందించి వైద్యసేవలు అందిస్తున్నాం.

– పుల్లయ్య, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, చింతూరు

రెవెన్యూ అధికారులకు పదోన్నతులు

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్లుగా నియామకం



డీఎస్ శాస్త్రి

సాక్షి,పాడేరు/చింతూరు: ప్రభుత్వం పలువురు రెవెన్యూ అధికారులకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించింది. వేదుల వెంకటసన్యాసిశర్మను పాడేరు గిరిజన సంక్షేమశాఖ ఎస్‌డీసీగా నియమించింది. ఇక్కడ ఎస్‌డీసీగా పనిచేస్తున్న వెంకటరత్న సాయిబాబు సీసీఎల్‌కు అసిస్టెంట్ సెక్రటరీగా బదిలీ అయింది. పి.అంబేద్కర్‌ను చింతూరు యూనిట్-2 ఎస్‌డీసీగా నియమించింది. అక్కడి డిప్యూటీ కలెక్టర్ స్వామినాయుడు రాజమహేంద్రవరంలోని పర్యాటకశాఖ రీజినల్ డైరెక్టర్‌గా నియమించింది. ఇ.జాన్‌రాజును రంపచోడవరం మొబైల్‌కోర్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించింది. జి.విక్టర్‌బాబు చింతూరు యూనిట్-2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ విభాగం)గా నియమితులయ్యారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి తహసీల్దార్ డీఎస్ శాస్త్రిని పదోన్నతిపై రంపచోడవరం గిరిజన సంక్షేమశాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం రంపచోడవరం ఎస్‌డీసీగా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వరరావుకు మాత్రం పోస్టింగ్ ఇవ్వలేదు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశాలు వచ్చాయి. జి.లక్ష్మిపతి పదోన్నతిపై వీఆర్.పురం యూనిట్-2 ఎస్‌డీసీగా నియమితులయ్యారు. కూనవరం-2 ఎస్‌డీసీగా విల్లూరి వెంకటరమణ, ఎటపాక యూనిట్ -2 డిప్యూటీ కలెక్టర్‌గా ఎల్.జోషప్‌ను ప్రభుత్వం నియమించింది.

దట్టంగా పొగమంచు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో పొగమంచు దట్టంగా కురుస్తోంది.శుక్రవారం ఉదయం 10గంటల వరకు మంచు తెరలు వీడలేదు. చింతపల్లిలో మాత్రం ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుముఖం పట్టాయి. గురువారం 14.3 డిగ్రీలు, శుక్రవారం 11డిగ్రీలు నమోదయ్యాయి. పాడేరు మండలం మినుములూరులో గురువారం 11 డిగ్రీలు, శుక్రవారం 13 డిగ్రీలు నమోదయ్యాయి.అరకులోయలో గురువారం 13.9 డిగ్రీలు, శుక్రవారం 14 డిగ్రీలు నమోదయ్యాయి.

స్పందన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

- పరిష్కారానికి తక్షణ చర్యలు
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- 42 వినతుల స్వీకరణ



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: స్పందనకు వచ్చిన గిరిజనుల సమస్యల పరిష్కారానికి అన్నిశాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏలో నిర్వహించిన స్పందనలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి ఆయనతోపాటు సబ్ కలెక్టర్ వి.అభిషేక్ 42 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. స్పందన ఫిర్యాదులను ఆన్‌లైన్ చేయడమే కాకుండా సత్వరమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను గిరిజనులు పొందడంలో సాంకేతిక సమస్యలు ఉంటే వాటిని సరిచేసి, తగిన న్యాయం చేయాలని ఆదేశించారు. ఐటీడీఏ ఏపీవో వి.ఎస్.ప్రభాకరరావు, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, ఇంజినీరింగ్ శాఖల ఈఈలు లీలాకృష్ణ, డి.వి.ఆర్.ఎం.రాజు, కె.వేణుగోపాల్, లావణ్యకుమార్, కొండయ్యపడాల్, బాలసుందరబాబు, డిఆర్‌డీఏ పీడీ మురళీ, డీఎల్‌పీవో పీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినతులివే..

- రైతు భరోసా సాయం తమ ఖాతాల్లో జమకాలేదని జీకే వీధి మండలం గాలికొండ పంచాయతీ పాతునగుంట గిరిజనులు కిల్లో భాస్కరరావు, కొర్రా సింగరాజు, కొర్రా సన్యాసిరావు తదితర 13 మంది విన్నవించారు.
- గాలికొండ నుంచి బత్తునూరు మీదుగా పాత్రుగుంట వరకు రహదారి నిర్మించాలని, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని ఇదే పంచాయతీ పాత్రుగుంట గిరిజనులు సత్తిబాబు, బాబురావు కోరారు.
- మెయిన్‌రోడ్డు నుంచి బొర్రపనసకు రోడ్డు నిర్మించాలని ముంచంగిపుట్టు మండలం బూసిపుట్టు పంచాయతీ బొర్రపనస గిరిజనులు భాస్కరరావు,శ్రీను వినతిపత్రం అందజేశారు.
- కర్రిముఖిపుట్టు నుంచి చెరువువీధి గ్రామానికి మంజూరైన రోడ్డు పనులు ప్రారంభించి రహదారితో పాటు రవాణా సౌకర్యాలు కల్పించాలని జర్రెల పంచాయతీ చెరువువీధి గిరిజనులు సబడ బొజ్జయ్య,అప్పారావు కోరారు.
- తన పేరును మంజరి మంజునాయుడిగా నమోదు చేయడంతో అమ్మ ఒడి పథకం అమలు కాలేదని, తన పేరును వెబ్‌సైట్‌లో సరిచేయాలని డింబుగుడ గ్రామానికి చెందిన వంజరి మంజు నాయుడు విన్నవించారు.
- తమ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని చింతూరు మండలం తడికవాగు, రాజుక్యాంప్, మల్లవరం గ్రామస్తులు కె.సుందర్, మంగ్గ తదితరులు వినతిపత్రం అందజేశారు.
- సర్వే నెం 8/1లో ఉన్న తన భూమిని వెబ్‌ల్యాండ్‌లో వంతాల చిక భూమిగా చూపిస్తుందని,సమగ్ర సర్వే జరిపి తనకు న్యాయం చేయాలని చింతపల్లి మండలం అన్నవరం పంచాయతీ పోతుగుమ్మాలు గ్రామానికి చెందిన వంతాల సొంబరి కోరారు. వైఎస్సార్ చేయూత పథకం మంజూరు చేయాలని లంబసింగి పంచాయతీ లబ్బంది గ్రామానికి చెందిన పాంగి బిములు కలెక్టర్‌ను కోరారు.

ఎల్లో మీడియా దుష్ప్రచారం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

- విశ్వసించని ప్రజలు
- సంక్షేమం వైపే మొగ్గు
- జీర్ణించుకోలేకే తప్పుడు ప్రచారాలు
- రాబోయే ఎన్నికల్లో 175కు 175 స్థానాలు వైఎస్సార్‌సీపీవే
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమ పాలనను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల మన్ననలను పొందుతుంటే దాన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు ఎల్లోమీడియా సహకారంతో ప్రభుత్వంపై తీవ్రమైన విమర్శలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి విమర్శించారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం మండలానికి ఆమె చాపరాతిపాలెంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. కేవలం ఐదు వేల రూపాయల గౌరవ వేతనంతో సేవా భావంతో పనిచేస్తున్నారన్నారు. కోవిడ్ సమయంలోనూ వీరు అనేక సేవలందించారని గుర్తు చేశారు. అటువంటి వాలంటీర్లను ప్రతిపక్ష నేతలు విమర్శించడం సిగ్గుచేటన్నారు.గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు జేబులు నింపుకునే కమిటీగా పేరుతెచ్చుకున్నాయన్నారు. ప్రభుత్వం ఏ కార్యక్రమాన్ని తలపెట్టినా అందులో లోపాలను వెతుకుతూ వాటిని బూతద్దంలో చూపించే ప్రయత్నాలను ఎల్లోమీడియాతో కలసి ప్రతిపక్షం చేపడుతోందన్నారు. ఎవరెన్ని కుటిల ప్రయత్నాలు చేసినా రాబోవు ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీదే అధికారం అని 175కు 175 ఎమ్మెల్యే స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడం ఖాయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను పార్టీ శ్రేణులు ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ ఖండించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ శివరత్నం, ఎంపీపీ బోయినకుమారి, చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాజులమ్మ, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేవుడు పాల్గొన్నారు.

ఘనంగా బారిజం ఉత్సవం



ఉత్సవంలో పాల్గొన్న గిరిజనులు



వేషధారణలతో సందడి

వేషధారణలతో గిరిజనుల సందడి

జి.మాడుగుల: మండలంలోని సుర్మతి గ్రామంలో గిరిజనులు బారిజం ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరిపారు. సంక్రాంతి పండగ సమయంలో రెండేళ్లకు ఒక సారి గిరిజనులు ఈ ఉత్సవం జరుపుకోవడం ఆచారం. పంటలు బాగా పండాలని, గ్రామంలోని అన్ని కుటుంబాల గిరిజనులతో పాటు పశుసంపద ఆరోగ్యంగా ఉండాలని కాంక్షిస్తూ శంకు దేముడితో పాటు ప్రకృతి దేవతలకు పూజలు చేయడం ఈ పండగ ఉద్దేశం. గిరిజనుల ఆయుధాలు, వ్యవసాయ పరికరాలకు పూజలు చేశారు. గిరిజన ఆచార, సంప్రదాయ ప్రకారం పూజలు చేసి మైదానంలో థింసా నృత్యాలు, డప్పు వాయిద్యాలతో గిరిజనులు హోరెత్తించారు. పలు వేషాలతో గిరిజనులు సందడి చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు, మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు, సర్పంచ్‌లు ఐసారం హనుమంతరావు, రాంబాబు, ఎంపీటీసీ వేణుబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఎస్.మత్స్యకొండబాబు తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు డొంకరాయి పవర్ కెనాల్ పనులు

మోతుగూడెం: సీలేరు కాంప్లెక్సు డొంకరాయి పవర్ కెనాల్ బయట పనులు తుది దశకు చేరుకున్నాయని జెన్‌కో సూపర్ ఇంజనీర్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవలే డొంకరాయి పవర్ కెనాల్ గండి పడి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు పనులు పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తి పునః ప్రారంభించామని చెప్పారు. అయితే ప్రస్తుతం పవన్ కెనాల్ బయట పనులకు సంబంధించి రాతిపేర్పు పనులు జరుగుతున్నాయన్నారు. ఇవి పది రోజుల్లో పూర్తవుతాయని తెలిపారు. పవర్ కెనాల్ పటిష్టంగా ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడమే కాకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో 'కొయ్యూరు' సత్తా

పతకాలు సాధించిన విద్యార్థులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ అభినందన



రెజ్లింగ్ అకాడమి విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: రాష్ట్రస్థాయిలో శాప్ నిర్వహించిన లీగ్ రెజ్లింగ్ పోటీల్లో జిల్లాలోని కొయ్యూరు రెజ్లింగ్ అకాడమికి చెందిన గిరి విద్యార్థులు సత్తా చాటారు. ఈనెల 12వ నుంచి 14 వరకు అనంతపురం జిల్లాలోని దిమ్మగుడి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర స్థాయిలో లీగ్ రెజ్లింగ్ పోటీలను శాప్ నిర్వహించింది. ఈ పోటీల్లో వివిధ స్థాయిల్లో గిరిజన బాలికలు, బాలురు ప్రతిభ చూపారు. ఎనిమిది బంగారం, నాలుగు వెండి, రెండు కాంస్య పతకాలతో రాష్ట్రస్థాయిలో ఆల్ రౌండ్ చాంపియన్ షిప్ పొందారు. రెజ్లింగ్‌లో సత్తా చాటిన విద్యార్థులు, కోచ్ నూకరాజును శుక్రవారం కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందించారు. పతకాలు, రాష్ట్ర చాంపియన్ ట్రోఫీని చూసి ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ముమ్మందు మరిన్ని పోటీల్లో విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఐటీడీఏ స్పోర్ట్స్ సెల్ సమన్వయకర్త పీడీల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.సింహాచలం, లుంగపర్తి పీడీ వి.బాలన్న పాల్గొన్నారు. బాలికల విభాగంలో కె.రాణి, కె.రూప, కె.కేశ్య, కె.దేవమ్మ బంగారు, జి.రూప. ఎస్.దేవి వెండి, కె.సుజాత, కె.కుమారి కాంస్య పతకాలు సాధించారు.

బాలుర విభాగంలో ఎం.రమణబాబు, వి.మహేష్, వి.ప్రసాద్, సీహెచ్.మహేష్ బంగారు, ఎస్.కార్తీక్ వెండి పతకం సాధించారు. కొయ్యూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న రెజ్లింగ్ అకాడమిని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ప్రోత్సహిస్తున్నారు.

ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాలు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశం



మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలో అర్హులైన గిరిజన రైతులకు ప్రభుత్వ పథకాలు అందజేసే విధంగా ఈకేవైసీ, ఆధార్ సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ అధికారులను రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు.ఐటీడీఏ సమావేశపు హాలులో శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన రైతులకు సంబంధించిన పంటలకు ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయాలని సూచించారు. ప్రతి మండలంలో రైతులందరికీ ఈకేవైసీ, ఆధార్ తప్పులు ఉంటే వాటిని పరిష్కరించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. గిరిజన రైతులకు వ్యవసాయానికి సంబంధించి అవసరమైన పరికరాల గురించి రైతులతో చర్చించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. రైతులకు బ్యాంకులోల రుణాలు మంజూరు చేయాలని తెలిపారు.ఏ జెన్సీలోని రైతులు పండించే కూరగాయ పంటలపై ఆయన వ్యవసాయ అధికారులతో చర్చించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కొండచీపుళ్ల పంట వివరాలు తెలుసుకున్నారు. రైతులు పంటలు నిల్వ చేసేందుకు గొడౌన్ల వివరాలను తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఏడీ కేవీ చౌదరి, కె సావిత్రి, ఏవో లక్ష్మణ్ పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుల ఎంపికలో అక్రమాలు?

- చక్రం తిప్పిన ఇద్దరు ఉద్యోగులు
- అభ్యర్థుల నుంచి భారీగా వసూళ్లు!
- ఓ జాబితాలో ఉన్న పేరు..
- మరో జాబితాలో గల్లంతు
- విచారణ చేపట్టాలని నిరుద్యోగుల డిమాండ్


ప్రిన్సిపల్ ట్రైనింగ్ స్కూల్ ఎదుట ఆందోళన చేస్తున్న స్టాఫ్ నర్సు అభ్యర్థులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): స్టాఫ్ నర్సు పోస్టుల ఎంపిక ప్రక్రియ అక్రమాలకు అడ్డాగా నిలిచింది. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు చక్రం తిప్పి అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిరుద్యోగ అభ్యర్థుల నుంచి రూ.3 లక్షల నుంచి రూ.4లక్షల చొప్పున వసూలు చేసినట్లు సమాచారం. కొంత మంది అభ్యర్థులకు ఉద్యోగాలతోపాటు అనుకున్న ప్రాంతంలో పోస్టింగ్ వచ్చే విధంగా చేస్తామని వారి నుంచి భారీగా దండుకున్నట్లు తెలిసింది. ఆ ఇద్దరు నిర్వాకం వల్ల దరఖాస్తు చేసిన అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓ జాబితాలో పేరు ఉండడం, మరో జాబితాలో పేరు లేకపోవడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. అనుకోకుండా పోస్టుల పెరగడం, కోవిడ్ సమయంలో పనిచేసిన వారికి వెయిటేజ్ మార్కులు కలపడం వంటి చర్యలు ఆ ఇద్దరి ఉద్యోగులకు కలిసి వచ్చాయి. దీంతో తమకున్న పరిచయాల ద్వారా ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అభ్యర్థుల నుంచి భారీగా డబ్బులు సేకరించినట్లు తెలిసింది. వీరికి ఆదేశాఖలో అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందించడం వల్ల జాబితాలో అనర్హులకు చోటు దక్కింది. అవసరం అయిన వారికి వెయిటేజ్ మార్కులు కలపకపోవడం, ఎలాంటి అర్హతలు లేని వారికి మార్కులు కలిపి అందలం ఎక్కించడం వంటి చర్యతో తుది జాబితా తప్పులు తడకలతో నిండిపోయింది.

అభ్యర్థుల ఆందోళన

జాబితా ప్రకారం మొత్తం 172 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు రావాల్సి ఉంది. కానీ మొదటి, రెండో, మూడో జాబితాలో పేర్లు ఉన్న అభ్యర్థులు శుక్రవారం ట్రైనింగ్ స్కూల్ ప్రిన్సిపల్ కార్యాలయానికి తరలివచ్చారు. మొత్తం 400 మందికి పైగా అభ్యర్థులు కౌన్సెలింగ్ జరగకుండా అడ్డుపడ్డారు. అనర్హులతో నిండిన జాబితా విడుదల చేశారని.. అర్హులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పిస్తుంటే.. సిబ్బంది అక్రమాలకు పాల్పడడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపికైన అభ్యర్థులను లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో శుక్రవారం జరగాల్సిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అరుపులు, కేకలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. చివరకు పోలీసులు రంగ ప్రవేశం చేసి అభ్యర్థులను అదుపు చేశారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత కౌన్సెలింగ్ ప్రారంభమైంది. 17న నిర్వహించిన కౌన్సెలింగ్ సమయంలో నిరుద్యోగ అభ్యర్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో.. అమరావతి నుంచి వైద్య ఆరోగ్యశాఖాధికారులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దారు. జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి.. ప్రభుత్వ జీవో, రోస్టర్ పాయింట్ల ప్రకారం కొత్త జాబితా రూపొందించారు.


ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

కొంప ముంచిన రహస్యం

పోస్టు భర్తీ ప్రక్రియలో మొదటి నుంచి అన్ని రహస్యంగా ఉంచడం వల్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో సిబ్బంది వివరాలు బయటకు చెప్పడానికి ఇష్టపడే వారు కాదు. ఆ కార్యాలయంలోని ఇద్దరు, ముగ్గురు ఉద్యోగుల మొత్తం జాబితాను సిద్ధం చేసి.. వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వద్దకు తీసుకెళ్లారు. 179 పోస్టులకు 172 మందితో జాబితా విడుదల చేశారు. మిగిలిన పోస్టులు ఎందుకు పెండింగ్‌లో ఉంచారన్న దానిపై పొంతన లేని సమాధానాలు చెప్పుకొచ్చారు. సరైన సమాధానం లేకపోవడం వల్ల శుక్రవారం జరిగిన కౌన్సెలింగ్‌కు 36 మంది అభ్యర్థులు హాజరు కాలేకపోయారు.

ఏడు పోస్టులు పెండింగ్

మొత్తం 179 పోస్టులకు గానూ 172 మందితో జాబితా ప్రకటించారు. ఏడు పోస్టులకు అభ్యర్థులు లేకపోవడం వల్ల పెండింగ్‌లో పెట్టారు. విమ్స్‌లో 24 పోస్టులకు గానూ 18, వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 108 పోస్టులకు గానూ 81, ఏపీ వైద్య విధాన పరిషత్ పరిధిలో 47 పోస్టులకు గానూ 29 పోస్టులను భర్తీ చేసినట్లు ఆర్డీ తెలిపారు. ఏడు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేకపోవడం వల్ల పెండింగ్‌లో పెట్టినట్లు చెప్పారు.

136 మంది నియామకం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలోని ట్రైనింగ్ స్కూల్ ప్రిన్సిపల్ కార్యాలయంలో అభ్యర్థుల ఆందోళనల మధ్య.. ఎట్టకేలకు స్టాఫ్ నర్సుల భర్తీ ప్రక్రియ కొనసాగింది. మొత్తం 179 పోస్టులకు గానూ 172 మంది అభ్యర్థులతో జాబితా ప్రకటించగా.. 136 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఎనిమిది మంది పోస్టుల్లో చేరేందుకు అయిష్టత చూపిస్తూ లేఖలు ఇచ్చారు. 36 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్(ఆర్డీ) ఉమాసుందరి తెలిపారు. కౌన్సెలింగ్ పూర్తి చేసిన వారికి నియామక ఉత్తర్వులు అందజేసినట్లు చెప్పారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

District sponsor

CMR SHOPPING MALL The joy of life ANDHRAPRADESH | TELANGANA

SAKSHI SAKSHI DIGITAL MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది. డిస్ట్రిక్ట్ స్పాన్సర్‌గా సీఎంఆర్ షాపింగ్‌మాల్ వ్యవహరిస్తోంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 70757 09205

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

స్థానిక గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వినతి

ముంచంగిపుట్టు: ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో స్థానిక నిరుద్యోగ గిరిజన యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోయిన గిరిజనులు డిమాండ్ చేశారు. శుక్రవారం మాచ్‌ఖండ్ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజినీర్ నాగేశ్వరరావును స్థానిక గిరిజన నిరుద్యోగులు కలిసి ప్రాజెక్టులో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం, జోలాపుట్టు జలాశయం వల్ల తమ పూర్వీకులు వ్యవసాయ భూములు కోల్పోయారని, వారు నిరక్షరాసులు కావడంతో ఎటువంటి ఉద్యోగ అవకాశాలు పొందలేకపోయారన్నారు. ప్రస్తుతం తామంతా ఉన్నత చదువులు చదివి ఉన్నామని, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని స్థానికులు వి.శేషాద్రి, వి.జయరాం, కె.నాగేశ్వరరావు, ఎం.ప్రవీణ్ ప్రకాశ్‌పడాల్, కె.బాబురావు తదితరులు ఎస్ఈకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఎస్ఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ మాచ్‌ఖండ్ ప్రాజెక్టులో ఉపాధి అవకాశాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.


మాచ్‌ఖండ్ ఎస్ఈ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

భూ నిర్వాసితులకు పూర్తిగా న్యాయం

సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రాజవొమ్మంగి: జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా జరుగుతున్న భూసేకరణలో నిర్వాసితులకు పూర్తి న్యాయం జరుగుతుందని రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు, ఇళ్ళు తదితర భవనాలు కోల్పోతున్న మండలంలోని జడ్డంగి, వట్టిగెడ్డ, దూసరపాము తదితర గ్రామాలకు చెందిన నిర్వాసితులతో ఆయన శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణం జరుగుతున్న పంచాయతీల వారిగా స్థానిక రెవెన్యూ అధికారులతో కలసి సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతు భూములు కోల్పోతున్న యజమానులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం అందజేయాల్సిన నష్టపరిహారం అందుతుందన్నారు.

నిర్వాసితులపట్ల ఉదారంగా వ్యవహరించండి: ఎమ్మెల్యే

జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న భూయజమానుల పట్ల ఉదారంగా వ్యవహరించాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సబ్‌కలెక్టర్ శుభం బన్సల్‌ను కోరారు. భూ నిర్వాసితులతో జడ్డంగి సచివాలయంలో సబ్‌కలెక్టర్ నిర్వహించిన గ్రామసభకు ఎమ్మెల్యే హాజరయ్యారు. వంచంగిలో జరుగాల్సిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి వెళుతు మార్గం మధ్యలో గ్రామంలో జరుగుతున్న గ్రామసభలో పాల్గొని సబ్‌కలెక్టర్‌తో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో నివసించే ప్రజల వద్ద భూములకు, తాము నివశించే ఇళ్ళు, తదితర స్థిరాస్తులకు సంభందించి దస్తావేజులు తదితర పూర్తి డాక్యూమెంట్స్ చూపించలేకపోవచ్చని అటువంటి వారిపై కాస్త ఉదాసీనంగా వ్యవహరించి పొజిషన్‌లో వున్న వారికి న్యాయం చేయాలని కోరారు. బాధితులకు పూర్తి స్థాయి కాంపెన్‌సేషన్ అందేలా చూడాలని సబ్‌కలెక్టర్‌ను కోరారు.


భూ నిర్వాసితులతో గ్రామసభ నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

- సుజనకోటలో రేకుల ఇల్లు దగ్ధం
- రూ.4లక్షల ఆస్తి నష్టం


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సర్పంచ్ రమేష్, వైఎస్సార్‌సీపీ నేతలు

ముంచంగిపుట్టు : మండలంలో గల సుజనకోట పంచాయతీ కేంద్రంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. దీంతో ఇంటిలో ఉన్న దుస్తులు, గృహోపకరణ వస్తువులు, బియ్యం, పప్పు దినుసులు, పుస్తకాలు వంటి విలువైన సామాగ్రి అంతా పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సుజనకోట గ్రామానికి చెందిన మండి బాపన్న రేకుల ఇంటిలో శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ స్విచ్ బోర్డులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాప్తి చెంది పక్కనున్న గ్యాస్ సిలిండర్‌కు అంటుకున్నాయి. దీంతో ఇంటి మొత్తం వ్యాప్తి చెందాయి. ఇంటిలో ఉన్న దుస్తులు, సర్టిఫికెట్లు, బియ్యం, నగదు, గృహోపకరణాలు అన్ని విలువైన వస్తువులు కాలిపోయి దగ్ధమయ్యాయి. మంటలను అదుపు చేసే ప్రయత్నం స్థానికులు చేసిన అప్పటికే జరగాల్సిన నష్టం అంతా జరిగిపోయింది. దీంతో మండి బాపన్న కుటుంబ సభ్యులు భోరున విలపించారు. రూ.4లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని, నిలువ నీడ లేకుండా అయిపోయిందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు మొరపెట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వీఆర్‌వో భాస్కర్ దగ్ధమైన ఇంటిని పరిశీలించి, వివరాలు సేకరించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ రమేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, మండల వైఎస్సార్‌సీపీ నేత గాసిరావు, నాగేశ్వరరావు, శంకర్‌రావు, పులిరాజు తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. జరిగిన సంఘటనపై విచారణ వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఫాల్గుణ, జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబ సభ్యులను ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించండి

జిల్లా రవాణాధికారి లీలాప్రసాద్ సూచన

పాడేరు రూరల్ : వాహన చోదకులు రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని జిల్లా రవాణాధికారి ఎస్. లీలాప్రసాద్ సూచించారు. రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 24వరకు రహదారి భద్రత వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడైనా ప్రమాదాలు సంభవిస్తే గంటపాటు తీవ్ర ప్రభావం చూపుతుందని ఆ సమయాల్లో అందించే సహాయం వల్ల మరణాలు నిలువరించవచ్చన్నారు. అలాంటి గోల్డెన్ అవర్‌లో మానవత్వంతో తప్పనిసరిగా సహాయం అందించాలని సూచించారు. అటువంటి సమయాల్లో సహాయం అందించే వారిపై ఎటువంటి కేసులు, విచారణలు, వేధింపులు, కోర్టుల చుట్టూ తిరిగే అవకాశం ఉండదన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె. వాసు మాట్లాడుతూ అర్హత కలిగిన విద్యార్థులు డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు సెల్‌ఫోన్లు మాట్లాడవద్దని, మద్యం సేవించవద్దని, స్పీడ్ రైడింగ్ చేయవద్దని సూచించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణం అందించాల్సిన సేవలను డాక్టర్ శ్రీకాంత్ విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి. చిట్టబ్బాయ్, కళాశాల అధ్యాపకుడు విజయ్, పీఈటీ ప్రసాద్‌నాయుడు, డీపీఆర్వో గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.